సాక్షి
తూర్పుగోదావరి
ఆదివారం । 11 । మే । 2025



రూ.1.11 లక్షల విరాళం


కొత్తపేట: ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి ఆలయంలో అన్నప్రసాద పథకానికి బల్లా వీరభద్రం, సరిత దంపతులు (శేరిలింగంపల్లి) రూ.1,11,116 విరాళం సమర్పించారు.



నిత్యాన్నదానానికి రూ.లక్ష

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి వారి నిత్యాన్నదాన పథకానికి ఇమంది శ్రీనివాసరావు, పద్మలత దంపతులు (విశాఖపట్నం) రూ.లక్ష విరాళం సమర్పించారు.

9.80 అడుగులకు నీటిమట్టం



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శనివారం మిగులు జలాల విడుదలను నిలిపి వేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.80 అడుగులకు చేరింది. డెల్టా కాలువలకు నీటిని విడుదల చేయలేదు.

న్యూస్‌రీల్

రద్దీగా శృంగార వల్లభుని సన్నిధి



స్వామి వారి దర్శనానికి క్యూ కట్టిన భక్తులు

పెద్దాపురం: మండలంలోని తొలి తిరుపతి గ్రామంలో స్వయంభువుగా వెలసిన శృంగార వల్లభ స్వామి వారిని శనివారం వేలాదిగా భక్తులు దర్శించుకున్నారు. స్వామివారికి ప్రీతి కరమైన రోజు కావడంతో ఉదయం నుంచే భక్తుల రాక మొదలైంది. మొత్తం 15 వేల మంది స్వామివారిని దర్శించుకున్నారని ఆలయ ఈఓ వడ్డి శ్రీనివాస్ తెలిపారు. వివిధ సేవల టికెట్ల ద్వారా రూ.2,05,750, అన్నదాన విరాళాలుగా రూ.76,031, కేశఖండన ద్వారా రూ.8,840, తులాభారం ద్వారా రూ.700, లడ్డూ ప్రసాదం విక్రయాల ద్వారా రూ.24,690 కలిపి స్వామివారికి రూ.3,16,011 ఆదాయం సమకూరిందని వివరించారు.

భక్తులతో కిక్కిరిసిన బాల తిరుపతి



స్వామివారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

మామిడికుదురు: బాల తిరుపతిగా భక్తుల పూజలందుకుంటున్న అప్పనపల్లి బాల బాలాజీ స్వామివారి ఆలయం శనివారం భక్తులతో కిక్కిరిసింది. స్వామివారి దర్శనానికి భారీగా భక్తులు తరలి వచ్చారు. తెల్లవారు జామున సుప్రభాత సేవ, తొలి హారతితో స్వామివారి దర్శనాలు ప్రారంభమయ్యాయి. స్వామివారి సన్నిధిలో జరిగిన శ్రీలక్ష్మీ నారాయణ హోమంలో భక్తులు పాల్గొన్నారు. స్వామి వారికి వివిధ సేవల ద్వారా రూ.4,06,417 ఆదాయం వచ్చింది. 5,500 మంది భక్తులు దర్శించుకున్నారు. 3,200 మంది అన్నప్రసాదం స్వీకరించారని ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. నిత్యన్నదానం ట్రస్టుకు భక్తులు రూ.1,01,381 విరాళాలుగా అందించారన్నారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం



దాత జగదీష్‌కు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ ప్రధానార్చకుడు

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి ముంబైకి చెందిన దోనేపూడి జగదీష్ రూ.లక్ష, ఠానేలంకకు చెందిన జగత వెంకట గంగాధర్ రూ.10,116 విరాళం అందజేశారు. ఈ సొమ్మును దాతలు ఆలయ ప్రధానార్చకుడు మాచరి వినాయకరావుకు అందించారు.

భీమేశ్వరస్వామి ఆలయంలో..

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయ అన్నదాన ట్రస్ట్‌కు విశాఖపట్నానికి చెందిన ఇమంది శ్రీనివాసరావు, పద్మలత దంపతులు శనివారం రూ.లక్ష విరాళం అందజేశారు. ఈఓ, దేవదాయ శాఖ సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గా భవాని చేతికి వారు నగదు అందించారు. స్వామివారి తీర్థ ప్రసాదాలు, జ్ఞాపికలను దాతలకు అందజేశారు.

రుణాల సిఫార్సు

- కూటమి నేతలు చెప్పిన వారికే కార్పొరేషన్ లోన్లు
- వందల్లో యూనిట్లు.. వేలల్లో దరఖాస్తులు
- కూటమి పార్టీలకు కోటాలు
- టీడీపీకి 70, జనసేన 20, కమలానికి 10 శాతం చొప్పున పంపకాలు



పెద్దాపురంలో కార్పొరేషన్ రుణాల ఇంటర్వ్యూలకు వచ్చిన అభ్యర్థులు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, కాకినాడ: తాంబూలాలు ఇచ్చేశాం తన్నుకు చావండి అన్నట్టుగా ఉంది కూటమి పాలనలో వివిధ కార్పొరేషన్ల రుణాల పరిస్థితి. బీసీ, ఎస్సీ, కాపు, ఇతర సామాజిక వర్గాలకు రుణాలో రుణాలు అంటూ మంత్రుల నుంచి ద్వితీయ శ్రేణి నేతల వరకూ ఇటీవల దండోరా మాదిరిగా పెద్ద హంగామానే సృష్టించారు. ప్రభుత్వం కూడా అన్ని సామాజిక వర్గాల అభ్యున్నతి అంటూ పెద్ద ఎత్తున ప్రచారం కూడా నిర్వహించింది. దరఖాస్తు చేసుకున్న అందరికీ సబ్సిడీ రుణాలని ఊరించారు. గత నెలలో ఆర్భాటంగా దరఖాస్తులు స్వీకరించారు. కూటమి నేతల మాటలు నమ్మి, స్వయం ఉపాధి పొందవచ్చనే ఆశతో వేలాది మంది దరఖాస్తు చేసుకున్నారు. తీరా మంజూరుకు వచ్చేసరికి వారి ఆశాలపై ప్రభుత్వం నీళ్లు జల్లింది. వివిధ కార్పొరేషన్ల ద్వారా మంజూరు చేసిన యూనిట్లకు, వచ్చిన దరఖాస్తులకు ఎక్కడా లంగరు అందడం లేదని అధికారులు తలలు పట్టుకుంటున్నారు. వందల్లో కేటాయించిన యూనిట్లకు వేలల్లో దరఖాస్తులు వచ్చి పడ్డాయి. ఈపాటి దానికి సబ్సిడీ రుణాలంటూ అంత హంగామా చేసి, ఇంతలా మోసం చేయాలా అని దరఖాస్తుదారులు నిలదీస్తున్నారు. మాటలు కోటలు దాటిపోయినా చేతలు మాత్రం గుమ్మం దాటడం లేదంటూ అగ్గిమీద గుగ్గిలమవుతున్నారు. అధికారం కోసం ఎడాపెడా హామీలు గుప్పించిన కూటమి పెద్దలు.. తీరా చేయి విదిల్చే సమయానికి అరకొర కేటాయింపులకే పరిమితమవడంపై సర్వత్రా అసంతృప్తి వ్యక్తమవుతోంది.

సిఫారసులు.. పంపకాలు

- కూటమిలోని టీడీపీ, జనసేన, బీజేపీలకు చెందిన ఎమ్మెల్యేలు, ముఖ్య నేతల సిఫారసు లేఖ లేకుండా దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోవడం లేదని దరఖాస్తుదారులు మండిపడుతున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని కొన్ని నియోజకవర్గాల్లో అయితే ప్రజాప్రతినిధుల లేఖలు జత చేసిన వారికి, నేరుగా ఫోన్లు చేసి చెప్పిన వారికి మాత్రమే మంజూరు జాబితాలో చోటు దక్కుతోంది.
- ఒక్కో నియోజకవర్గంలో అన్ని సామాజిక వర్గాలకు కలిపి అన్ని కార్పొరేషన్ల నుంచి సుమారు 120 యూనిట్లు కేటాయించారు. వీటి కోసం 1,500 నుంచి 2,500 మంది దరఖాస్తు చేసుకున్నారు. దీంతో, ఈ అరకొర యూనిట్లు తాము సిఫారసు చేసిన వారికే దక్కాలంటూ అనేక నియోజకవర్గాల్లో కూటమిలోని మూడు పార్టీల నేతలు గొడవలకు దిగుతున్నారు. టీడీపీ, జనసేన నాయకుల మధ్య అయితే పెద్ద యుద్ధమే జరుగుతోంది.
- ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం సహా కాకినాడ సిటీ, రూరల్, పెద్దాపురం, ముమ్మిడివరం, అమలాపురం, పి.గన్నవరం, గోపాలపురం, రాజానగరం తదితర నియోజకవర్గాల్లో టీడీపీ, జనసేన నేతలు నువ్వా నేనా అనే స్థాయిలో గొడవలు పడుతున్నారు.
- జనసేన ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం, రాజానగరం, నిడదవోలు, కాకినాడ రూరల్ నియోజకవర్గాల్లో సింహభాగం తమకే దక్కాలని ఆ పార్టీ నేతలు పట్టుబడుతున్నారు.
- కాకినాడ జిల్లాలో ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ వర్గాలు తమకు కూడా కొంత కోటా కేటాయించాలని కుస్తీ పడుతున్నాయి. దీనిపై కూటమి పార్టీల నేతలు సమాలోచనలు జరిపి, చివరకు కోటాలు కేటాయించారు.
- కాకినాడ సిటీ, రూరల్, పి.గన్నవరం, రాజోలు, నిడదవోలు, రాజానగరం నియోజకవర్గాల్లో టీడీపీకి 60 శాతం, జనసేనకు 30 శాతం, బీజేపీకి 10 శాతం (ఒక్క అనపర్తిలో మాత్రం బీజేపీ, టీడీపీకి కలిపి 60 శాతం) కోటా అంటూ పంపకాలకు తెర తీశారు.
- పెద్దాపురం నియోజకవర్గంలో వివిధ కార్పొరేషన్ల నుంచి మంజూరైన యూనిట్లను టీడీపీ నాయకులు 80 శాతం, జనసేన 18 శాతం, బీజేపీ 2 శాతం చొప్పున పంచుకున్నారని చెబుతున్నారు.

తూర్పు గోదావరి జిల్లాలో రుణాల లక్ష్యం, దరఖాస్తుల వివరాలు

కార్పొరేషన్	కేటాయించిన యూనిట్లు	దరఖాస్తులు
బీసీ కార్పొరేషన్	1,374	16,409
కాపు కార్పొరేషన్	757	8,193
ఈడబ్ల్యూఎస్	203	2,214
ఎస్సీ కార్పొరేషన్	891	---

(ఎస్సీ కార్పొరేషన్ రుణ దరఖాస్తుల గడువు శనివారం ముగిసింది)

అధికారుల ఉక్కిరిబిక్కిరి

- వందల్లో యూనిట్లు, వేలల్లో దరఖాస్తులు రావడంతో మండల స్థాయిలో అధికారులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.
- ముమ్మిడివరం మండలంలో అన్ని యూనిట్లు కలిపి 123 కేటాయించగా, అక్కడ 2 వేలకు పైనే దరఖాస్తులు వచ్చాయి. 16 గ్రామ పంచాయతీలున్న ముమ్మిడివరం మండలంలో కాపు కార్పొరేషన్ నుంచి 8 యూనిట్లు కేటాయించారు. ఒక గ్రామానికి ఒక యూనిట్ కూడా కేటాయించలేని పరిస్థితుల్లో నేతల నుంచి వస్తున్న సిఫారసులతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు.
- అమలాపురం పట్టణానికి 80 నుంచి 100 యూనిట్లు కేటాయిస్తే సుమారు 2,100 దరఖాస్తులు వచ్చాయని సమాచారం.
- కాకినాడ సిటీలో 36వ డివిజన్‌కు 2 కాపు కార్పొరేషన్ యూనిట్లు కేటాయించగా, 15 మంది దరఖాస్తు చేశారు.
- ఈ పరిస్థితుల్లో కూటమి నేతల ఒత్తిళ్లు భరించలేక కొందరు మండలాధికారులు సెలవుపై వెళ్లిపోయేందుకు సిద్ధపడుతున్నారు.

అర్హులందరికీ ఇవ్వాలి



బీసీ కార్పొరేషన్ రుణాలు పారదర్శకంగా మంజూరు చేయాలి. ఎవరికెన్ని యూనిట్లనే విషయంపై కూటమి నాయకుల మధ్య వాటాలు తెగక దరఖాస్తుదారులను ఇబ్బందులకు గురి చేయడం తగదు. మండలాలకు కేటాయించిన యూనిట్లు పదుల సంఖ్యలో ఉంటే వచ్చిన దరఖాస్తులు వేలల్లో ఉంటున్నాయి. యూనిట్లకు పరిమితి విధించి, అర్హులందరికీ రుణాలు ఎక్కడి నుంచి ఇస్తారు? పైగా నేతల సిఫారసులున్న వారికే రుణాలిస్తామని అంటున్నారు. బీసీ కార్పొరేషన్ ద్వారా యూనిట్ల మంజూరు పూర్తి కాకుండానే ఎస్సీ కార్పొరేషన్ యూనిట్లకు నోటిఫికేషన్ ఇచ్చారు. యూనిట్లు పక్కదారి పట్టకుండా, సిఫారసులతో పని లేకుండా అర్హులందరికీ రుణాలు అందించాలి.

– కొక్కిరపాటి వెంకట్రావు, సీఐటీయూ జిల్లా నాయకుడు, నల్లజర్ల

ప్రతిధ్వనించిన వేదఘోష

- సత్యదేవుని సన్నిధిలో ఘనంగా పండిత సదస్యం
- 150 మంది పండితులకు సత్కారం



సదస్యంలో పాల్గొన్న పండితులు

అన్నవరం: రత్నగిరి వేద ఘోషతో ప్రతిధ్వనించింది. సత్యదేవుని దివ్యకల్యాణ మహోత్సవాల్లో భాగంగా నవ దంపతులు సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్ల సమక్షంలో శనివారం వేద పండిత సదస్యం ఘనంగా నిర్వహించారు. రాష్ట్రం నలుమూలల నుంచీ విచ్చేసిన సుమారు 150 మంది వేద, స్మార్త పండితులు స్వామివారి ముందు తమ విద్వత్తును ప్రదర్శించారు. మధ్యాహ్నం 3 గంటలకు పెళ్లి పెద్దలు సీతారాములు వెంట రాగా స్వామి, అమ్మవార్లను అనివేటి మండపం వద్దకు ఊరేగింపుగా తీసుకువచ్చి, అక్కడి వేదికపై వేంచేయించారు. స్వామి, అమ్మవార్లను సర్వాంగ సుందరంగా అలంకరించి పూజలు చేశారు. సాయంత్రం ఆరు గంటల వరకూ పండితుల వేద మంత్రఘోషతో ఆలయ ప్రాంగణం మార్మోగిపోయింది. ఈ సందర్భంగా వేద పండితులను దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ వీర్ల సుబ్బారావు ఘనంగా సత్కరించారు. సత్కారం పొందిన వారిలో మహామహోపాధ్యాయ విశ్వనాథ గోపాలకృష్ణశాస్త్రి, గొల్లపల్లి దత్తాత్రేయ ఘనపాఠి (రాజమహేంద్రవరం), ఉపాధ్యాయుల కాశీపతి సోమయాజులు ఘనపాఠి (తిరుపతి), ఉపాధ్యాయుల లక్ష్మీనృసింహ ఘనపాఠి (విజయవాడ దుర్గమ్మ దేవస్థానం), దువ్వూరి ఫణియజ్ఞ ఘనపాఠి, విష్ణుభట్ల లక్ష్మీనారాయణ ఘనపాఠి (తిరుపతి వేద విశ్వవిద్యాలయం), అన్నవరం దేవస్థానం వేద పండితులు ఉన్నారు.

ఘనంగా పొన్నచెట్టు వాహన సేవ

సత్యదేవుడు, అమ్మవారిని రాత్రి పొన్నచెట్టు వాహనం మీద ఘనంగా ఊరేగించారు. రాత్రి 9 గంటలకు స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఊరేగింపుగా కొండ దిగువన తొలి పావంచా వద్దకు తీసుకువచ్చి, పొన్నచెట్టు వాహనంపై వేంచేయించి, పూజలు చేశారు. అక్కడి నుంచి ఆంధ్రా బ్యాంక్ సెంటర్‌కు వెళ్లి, తిరిగి తొలి పావంచా వరకూ ఊరేగింపు సాగింది.

‘చిన్నారి ఆరోగ్యం’ భేష్

- గెయిల్ సీఎస్ఆర్ నిధులతో నూతన కార్యక్రమం
- ప్రారంభించిన మంత్రి దుర్గేష్



చిన్నారి తల్లికి పోషకాహార కిట్ అందజేస్తున్న మంత్రి దుర్గేష్, కలెక్టర్ ప్రశాంతి తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): రాష్ట్రంలోనే తొలి సారిగా వినూత్నంగా ‘చిన్నారి ఆరోగ్యం’ కార్యక్రమం ప్రారంభించడం మంచి పరిణామమని రాష్ట్ర పర్యాటక మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. గెయిల్ సంస్థ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులతో చేపట్టిన ఈ కార్యక్రమాన్ని స్థానిక శ్రీ వెంకటేశ్వర ఆనం కళా కేంద్రంలో శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జిల్లాలో 6 నెలల నుంచి ఆరేళ్ల వయస్సు కలిగిన దాదాపు 74,238 మంది చిన్నారుల సంపూర్ణ ఆరోగ్యానికి కృషి చేయడం సంతోషకరమన్నారు. జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ, జిల్లావ్యాప్తంగా 1,448 మంది పిల్లలు అతి తీవ్ర పోషకాహారం లోపంతో, 95 మంది తీవ్ర అనారోగ్యంతో బాధ పడుతున్నారని తెలిపారు. వీరిని ప్రతి బుధవారం బాలమిత్రలు సందర్శించి వారి ఎత్తు, బరువు, ఆరోగ్య స్థితిని పరీక్షించి, చిన్నారి ఆరోగ్య యాప్‌లో అప్‌లోడ్ చేస్తారన్నారు. ఈ పిల్లలకు నెలకోసారి పోషకాహారం కిట్లు పంపిణీ చేస్తారన్నారు. గెయిల్ జనరల్ మేనేజర్ వైఏ కుమార్ మాట్లాడుతూ, చిన్నారులకు సంపూర్ణ పోషణ కూడిన ఆహారం అందజేసేందుకు తమ సంస్థ ద్వారా రూ.38 లక్షల ఆర్థిక చేయూత అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు, గెయిల్ డిప్యూటీ జనరల్ మేనేజర్లు దీవి ప్రభాకర్ (హెచ్ ఆర్), కె.రాజన్ తదితరులు పాల్గొన్నారు. తొలుత ఈ నెలాఖరున ఉద్యోగ విరమణ చేయనున్న జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ అధికారి కె.విజయ కుమారిని సన్మానించారు. చివరిలో బాలింతలకు సీమంతం, చిన్నారులకు గ్రాడ్యుయేషన్ నిర్వహించారు. పిల్లల తల్లులకు పోషకాహార కిట్లు అందజేశారు.

వీరమరణం పొందిన సైనికులకు నివాళి

తొలుత పాకిస్తాన్ ఉగ్రమూకల దాడిలో వీరమరణం పొందిన సైనికుల ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ, పాక్ కాల్పుల్లో రాష్ట్ర జవాన్ మురళీ నాయక్ వీరమరణం కలచివేసిందని నివాళులర్పించారు. వీరమరణం పొందిన సైనికుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ ‘భారత్ మాతాకీ జై, జై జవాన్ అని నినదించారు.

అప్రోచ్ రోడ్లు, దీపాలు వేయించరా?

- ఎంతో పోరాడి మోరంపూడి ఫ్లై ఓవర్ నిర్మించాం
- నాకు పేరు వస్తుందనే ఇక్కడ పనులు ఆపేశారా?
- అవినీతి, అక్రమాల పైనే తప్ప అభివృద్ధిపై దృష్టి పెట్టరేం?
- మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ సూటి ప్రశ్న
- ఫ్లై ఓవర్ వద్ద గోతులు పూడ్చి, నిరసన



మోరంపూడి ఫ్లై ఓవర్ అప్రోచ్ రోడ్డులో గోతులు పూడుస్తున్న మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్

రాజమహేంద్రవరం రూరల్: తాను ఎంతో పోరాడి, త్రికరణ శుద్ధితో మోరంపూడి ఫ్లై ఓవర్ నిర్మాణం పూర్తి చేయిస్తే, కనీసం అప్రోచ్ రోడ్లు, లైట్లు వేయించాలనే ఆలోచన కూటమి ప్రభుత్వానికి లేకపోవడం దారుణమని మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్‌రామ్ విమర్శించారు. మోరంపూడి ఫ్లై ఓవర్ వద్ద వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలసి ఆయన శనివారం నిరసన తెలిపారు. అక్కడి గోతులను మట్టితో పూడ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జాతీయ రహదారిపై కీలక జంక్షన్‌గా ఉన్న మోరంపూడి సెంటర్‌లో వేలాది ప్రమాదాలు జరిగి, వందలాది మంది ప్రాణాలు కోల్పోయారని అన్నారు. దీనిని నివారించేందుకే పట్టుబట్టి ఇక్కడ ఫ్లై ఓవర్ సాధించామని చెప్పారు. తాము కట్టించిన ఫ్లై ఓవర్‌కు రిబ్బన్ కత్తిరించడం మినహా కూటమి ప్రభుత్వం అప్రోచ్ రోడ్లు, లైట్లు, సర్వీస్ రోడ్ల వంటి ఎలాంటి సౌకర్యాలూ కల్పించలేదని అన్నారు. గోదావరిలో ఇసుక, రాజమహేంద్రవరంలో భూములు దోచుకోవడం, లిక్కర్ మాఫియాతో అడ్డగోలు సంపాదన పైనే ఎమ్మెల్యే, ఆయన అనుచరులు ఆత్రుత పడుతున్నారని ఆరోపించారు. రాజమహేంద్రవరం నగరంలో పేకాట క్లబ్బులు, గాంబ్లింగ్, స్పా సెంటర్ల వంటివి ఎమ్మెల్యే మనుషులే పెట్టుకుని ఇక్కడి సంస్కృతిని భ్రష్టు పట్టిస్తున్నారని భరత్ విమర్శించారు. వీటన్నింటిపై ఉన్న శ్రద్ధ నిర్మాణం పూర్తయి, ప్రారంభించి ఏడాది అయిన ఫ్లై ఓవర్‌కు అప్రోచ్ రోడ్లు వేయించడంపై ఎందుకు లేదని నిలదీశారు. ఒకవైపు ప్యాచ్ వర్కులు చేస్తున్నారని, వాళ్లనే ఇక్కడకు తీసుకుని వచ్చి, కనీసం ఆ పనులైనా చేయించవచ్చు కదా అని అన్నారు. ప్యాచ్ వర్కులు కూడా చేయకపోవడంతో వాహనదారుల నడుములు విరిగిపోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

మోరంపూడి ఫ్లై ఓవర్ వలన తనకు మంచి పేరు వస్తుందనే దురుద్దేశంతో అప్రోచ్ రోడ్లు, లైట్లు వేయించకుండా తాత్సారం చేస్తున్నారా అని భరత్‌రామ్ అనుమానం వ్యక్తం చేశారు. చిన్న ప్యాచ్ వర్కులు కూడా చేయలేని దౌర్భాగ్య పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం ఉందని దుయ్యబట్టారు. అభివృద్ధి పనుల్లో ఎమ్మెల్యే చేతకానివాడేనని, అందుకే ప్రభుత్వం మేల్కొని అప్రోచ్ రోడ్లు, లైట్లు వేయించాలని డిమాండ్ చేశారు. బంగ్లా నుంచి నిత్యం ఇదే రోడ్డులో కలెక్టరేట్‌కు వెళ్తున్న కలెక్టరైనా స్పందించాలి కదా అని ప్రశ్నించారు. ఫ్లై ఓవర్ మీది నుంచి వెళ్లిపోవడంలో అప్రోచ్ రోడ్ల బాధ తెలియడం లేదేమోనని అన్నారు. తగిన శ్రద్ధ తీసుకుని, ఈ సమస్యను పరిష్కరించాలని కలెక్టర్‌ను డిమాండ్ చేశారు. నేషనల్ హైవే సంస్థ వలన కాకపోతే మున్సిపల్ కార్పొరేషన్ అయినా ఈ పనులు చేపట్టాలని సూచించారు. కనీసం ఎంపీ పురందేశ్వరి అయినా దీనిపై దృష్టి పెట్టకపోతే ఎలాగని, కాంట్రాక్టర్‌తో చేయించాలని అన్నారు. ప్రజల బాధలు చూసి, డస్ట్, చిప్స్ రప్పించి ఇక్కడి గుంతల్లో ప్యాచ్ వర్కులు చేయిస్తున్నామని భరత్ అన్నారు.

కంచికి చేరుతున్న కోతలు

- జిల్లాలో 58,586 హెక్టార్లలో రబీ వరి సాగు
- 57,946 హెక్టార్లలో కోతలు పూర్తి
- 5.26 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి
- మందకొడిగా కొనుగోళ్లు
- ఎక్కడి ధాన్యం అక్కడే..
- అన్నదాతలను హడలెత్తిస్తున్న అకాల వర్షాలు



దేవరపల్లి మండలం గౌరీపట్నం వద్ద యంత్రంతో వరి కోతలు



కొనే నాథుడు లేక రోడ్ల పైనే ఉన్న ధాన్యం రాశులు

దేవరపల్లి: జిల్లాలో రబీ వరి కోతలు చివరి దశకు చేరుకున్నాయి. సీజన్ ప్రారంభంలో అధిక వర్షాలు కురవడంతో ఎక్కువ మంది రైతులు వరి నాట్లు ఆలస్యంగా వేశారు. బోర్ల కింద ముందుగా సాగు చేసిన పంట కోతలు సకాలంలో జరిగినప్పటికీ.. ఆలస్యంగా నాట్లు వేసిన చోట్ల కోతలు ఇంకా జరుగుతున్నాయి. అధికారుల లెక్కల ప్రకారం జిల్లా వ్యాప్తంగా 18 మండలాల్లో రైతులు 58,586 హెక్టార్లలో రబీ వరి సాగు చేశారు. 4,520 హెక్టార్లలో ఫైన్ వెరైటీ, 46,204 హెక్టార్లలో కామన్ వెరైటీ, 5,154 హెక్టార్లలో పీఆర్–126 రకం వంగడాలను రైతులు పండించారు. ఇప్పటి వరకూ 57,946 హెక్టర్లలో (98 శాతం) వరి కోతలు పూర్తయ్యాయి. దీని ద్వారా 5,26,435 మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి జరిగింది. మరో రెండు వారాల్లో కోతలు దాదాపు పూర్తవుతాయని అధికారులు చెబుతున్నారు.

దిగుబడులు ఆశాజనకం

రబీ వరి దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎకరాకు 50 నుంచి 60 బస్తాల వరకూ దిగుబడులు సాధించారు. సగటున ఎకరాకు 50 బస్తాలు తగ్గకుండా దిగుబడి వస్తోందని రైతులు చెబుతున్నారు. అయితే, మద్దతు ధర లభించడం లేదని వాపోతున్నారు. అరకొరగా సంచుల సరఫరా, తేమ శాతం నిబంధనలతో మిల్లర్లు ఇబ్బందులు పెట్టడం, ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలను సకాలంలో తెరవకపోవడంతో దళారులను ఆశ్రయించి తక్కువ ధరకు పంటను అమ్ముకోవలసి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిల్లుకు వెళ్లినా లోడు సకాలంలో దింపుకోక ఇబ్బందులు పడుతున్నామని చెబుతున్నారు. ప్రభుత్వం 75 కిలోల బస్తాకు రూ.1,750 మద్దతు ధర ప్రకటించింది. కానీ, దళారులు రూ.1,250 నుంచి రూ.1,350కి కొనుగోలు చేయడంతో దారుణంగా నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు. యంత్రాలతో కోతలు కోసి రోడ్లపై ఆరబెట్టి ఎప్పటి ధాన్యం అప్పుడే అమ్ముకుంటున్నారు. వాతావరణం అనుకూలించక పోవడంతో ఎక్కువ మంది రైతులు దళారులను ఆశ్రయించి తక్కువ ధరకు పంటను అమ్ముకోవలసి వస్తోంది. పీఆర్–126 (బొండాలు) రకం ధాన్యం కొనుగోలుకు మిల్లర్లు ముందుకు రావడం లేదని రైతులు చెబుతున్నారు.

అకాల వర్షాలతో టెన్షన్

రబీ వరి కోతల ప్రారంభం నుంచి ఈదురు గాలులతో అకాల వర్షాలు కురుస్తుండటంతో అన్నదాతలు టెన్షన్ పడుతున్నాడు. రాత్రి సమయంలో అకాల వర్షాలు కురుస్తుండటంతో రోడ్లపై ఆరబెట్టిన ధాన్యం తడిసి ముద్దవుతోందని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికీ వేల బస్తాల ధాన్యం ఎక్కడికక్కడే రోడ్లపై ఉంది. దీంతో, కంటి మీద కునుకు లేకుండా ధాన్యం రాశుల వద్దే రైతులు పడిగాపులు పడుతూ, పంటను కాపాడుకుంటున్నారు. పగలంతా రోడ్లపై ఆరబెట్టిన ధాన్యాన్ని సాయంత్రం రాశులుగా వేసి బరకాలు కప్పి, ఒబ్బిడి చేసుకుంటున్నారు. చాలా ప్రాంతాల్లో రోడ్లన్నీ ధాన్యం రాశులతో నిండి ఉన్నాయి.

మద్దతు ధరకు కొనాలి



ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధర దక్కడం లేదు. కొనుగోలు కేంద్రాలు మొక్కుబడిగా పని చేస్తున్నాయి. కొనే నాథుడు లేక 40 శాతం ధాన్యం ఎక్కడిదక్కడే ఉంది. ఎక్కువ శాతం దళారులే కొనుగోలు చేస్తున్నారు. దిగుబడి బాగున్నప్పటికి ధర లేక గిట్టుబాటు కావడం లేదు. రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పండిన ప్రతి గింజనూ గిట్టుబాటు ధరకు కొనుగోలు చేసి, రైతులను ఆదుకున్నారు. ఇప్పుడు మిర్చి, పెండలం, కోకో.. ఇలా రైతు పండించిన ఏ పంటకూ గిట్టుబాటు ధర రావడం లేదు. కూటమి ప్రభుత్వంలో రైతులు కోలుకోలేని స్థితిలో ఉన్నారు. రైతులకు సకాలంలో గోనె సంచులు అందించి, కొనుగోలు కేంద్రాల ద్వారా మద్దతు ధరకే ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు చేయాలి.

– వల్లభనేని సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ రైతు విభాగం, వెదుళ్లకుంట, గోపాలపురం మండలం

చివరి దశకు కోతలు



రబీ కోతలు చివరి దశకు చేరాయి. ఎప్పటి ధాన్యాన్ని అప్పుడే రైతులు తమకు నచ్చిన మిల్లుకు పంపిస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకూ 2.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ జరిగింది. రైతులు 2 లక్షల టన్నుల ధాన్యాన్ని ఇప్పటికే దళారులకు అమ్ముకున్నారు. మొత్తం 3.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలన్నది ప్రభుత్వ లక్ష్యం.

– ఎస్.మాధవరావు, జిల్లా వ్యవసాయ అధికారి, రాజమహేంద్రవరం

క్లుప్తంగా

జాతీయ చదరంగం పోటీలకు సాన్వీ



సాన్వికి ట్రోఫీ, సర్టిఫికెట్ అందిస్తున్న కోనేరు హంపి తల్లిదండ్రులు

అమలాపురం రూరల్: గుంటూరులో ఈ నెల 9, 10 తేదీల్లో జరిగిన రాష్ట్ర స్థాయి చదరంగం అండర్ – 7 పోటీల్లో అమలాపురంలోని కామనగరువు ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో 3వ తరగతి చదువుతున్న బి.సాన్వీ అత్యుత్తమ ప్రతిభ చూపి, 5 బై 6 పాయింట్లు సాధించింది. రాష్ట్ర స్థాయిలో 2వ స్థానంలో నిలిచి జాతీయ చదరంగ పోటీలకు అర్హత సాధించింది. ఆమెకు కోనేరు హంపి తల్లిదండ్రులైన అశోక్, లత చేతుల మీదుగా ట్రోఫీ అందించారు. ఈ నేపథ్యంలో ఒడిశాలో జూన్‌లో జరిగే జాతీయ పోటీల్లో సాన్వీ పాల్గొంటుందని కోచ్ వి.శ్రీనుబాబు తెలిపారు. సాన్వీని స్కూల్ డైరెక్టర్ నంద్యాల మనువిహార్, ప్రిన్సిపాల్ దేవీ దీక్షిత్ శనివారం అభినందించారు.

కాలువలో పడి మహిళ మృతి

కాకినాడ రూరల్: మండలంలోని సూర్యారావుపేట పరకాలువలో పడి పితాని రమణమ్మ (57) మృతి చెందింది. తిమ్మాపురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పరకాలువకు చెందిన రమణమ్మ ఉపాధి హామీ కూలీగా పనిచేస్తుంది. ఆమె భర్త గతంలోనే చనిపోయాడు. వారికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న రమణమ్మ ఈ నెల 7న ఇంటి నుంచి బయటకు వెళ్లి అదృశ్యమైంది. ఆమె ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు గాలిస్తున్నారు. ఈ నేపథ్యంలో పరకాల్వ తూటి కాడపై ఆమె మృతదేహం శనివారం స్థానికులకు కనిపించడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. తిమ్మాపురం ఇన్‌చార్జి ఎస్సై ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో..

ముమ్మిడివరం: ఎదురుగా వస్తున్న వ్యాన్‌ను ఢీకొని బైక్‌పై వెళుతున్న యువకుడు మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. అల్లవరం మండలం కోడూరుపాడు శివారు నక్కల పుంతకు చెందిన సవరపు నాగబాబు (28) శనివారం సాయంత్రం యానాం వెళ్లి తిరిగి వస్తున్నాడు. నగర పంచాయతీలోని కొండాలమ్మ గుడి వద్ద 216 జాతీయ రహదారిపై అమలాపురం నుంచి వస్తున్న వ్యాన్‌ను ఢీకొన్నాడు. ఈ ఘటనలో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. నాగబాబుకు భార్య రేణుక, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు ఎస్సై డి.జ్వాలాసాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆధ్యాత్మిక సౌరభం

- విరవలో భక్తి పరిమళాలు
- చిన్నారులకు శ్లోకాలపై శిక్షణ
- పెద్దలకూ నేర్పిస్తున్న వైనం
- రాజాచంద్ర కృషితో సాకారం



విరవలో విద్యార్థులకు శ్లోకాలు నేర్పుతున్న రాజాచంద్ర



శ్లోకాలు పఠిస్తున్న మహిళలు

పిఠాపురం: ఆధ్యాత్మికతతో మానసిక, శారీరక ప్రశాంతత కలుగుతుంది. మెదడు చురుగ్గా పనిచేసి, ఉత్సాహంగా ఉండగలుగుతాం. మనం ప్రశాంతంగా ఉన్నప్పుడు చేసే పనిలో విజయం లభిస్తుంది. ఆధ్యాత్మికతతో మనతో పాటు సమాజం కూడా అభ్యున్నతి చెందుతుంది. ఇలా.. ఆధ్యాత్మికత గొప్పదనాన్ని గుర్తించిన ఓ యువకుడు.. తనతో పాటు ఊరిని కూడా భక్తిమార్గంలో నడుపుతున్నాడు. అందరూ అన్నయ్యగా పిలిచే విరవకు చెందిన రాజాచంద్ర విజయగాథ ఇది.

నిత్యం దైవనామస్మరణ

పిఠాపురం మండలం విరవ గ్రామం ఆధ్యాత్మికతకు పెట్టింది పేరు. ఆ ఊరిలో ఎక్కడ చూసినా ధార్మిక ప్రచారం జరుగుతూ ఉంటుంది. ఎవరి నోట విన్నా భాగవతం, భగవద్గీత, లలిత, విష్ణు సహస్ర నామాలు, భక్తి పాటలు వినిపిస్తుంటాయి. ఏ గుడిలో చూసినా అందరూ ఒకే రకం దుస్తులు ధరించి దైవ నామ స్మరణలో మునిగి తేలుతుంటారు. ఆ ఊరినే ఒక ఆధ్యాత్మిక కేంద్రంగా మార్చేశాడు ఒక యువకుడు. అతడే రాజా చంద్ర. ఆ ఊరిలో మహిళలకు, పిల్లలకు ప్రత్యేక తరగతులు నిర్వహించి ఆధ్యాత్మికతను బోధించడం, వారి ద్వారా ప్రచారం చేయడంలో ఆయన అనతి కాలంలోనే విజయం సాధించాడు. దీంతో పాటు టెంపుల్ గైడ్ అనే యూట్యూబ్ చానల్ , ఫేస్‌బుక్ అకౌంట్ నిర్వహిస్తూ దేశంలోని అన్ని హిందూ దేవాలయాల సమాచారం యాత్రికులకు అందుబాటులోకి తీసుకువచ్చాడు.

సమగ్ర సమాచారం

దేశంలో ఏ గుడి సమాచారం అయినా రాజా చంద్ర రూపొందించిన టెంపుల్ గైడ్‌లో ఉంటుంది. ఎవరు ఏ యాత్ర చేద్దామన్నా దానిని ఫాలో అయితే చాలు ఏ గైడ్ తోనూ పని లేకుండా సులభంగా దేవాలయాలను దర్శించుకునే వీలు కలుగుతుంది. గ్రామంలో చిన్న పిల్లలకు భగవద్గీతను బోధించడంతో పాటు వారు అనర్గళంగా శ్లోకాలు చదివేలా తర్ఫీదు నిచ్చారు. దీంతో వందల మంది పిల్లలు ఇప్పుడు భగవద్గీతను అనర్గళంగా చదవడంతో పాటు, పఠించి పది మందికి నేర్పించే స్థాయికి చేరుకున్నారు.

ముందు భయమేసింది



నేను 5వ తరగతి నుంచి రాజా చంద్ర అన్నయ్య పెడుతున్న తరగతులకు వస్తున్నాను. భగవద్గీత నేర్చుకోవడం అంటే ముందు భయమేసింది. కానీ ఆయన నేర్పే విధానం మాలోని భయాన్ని పోగొట్టింది. చాలా సులువుగా నేర్చుకున్నాను. 5వ తరగతిలోనే సి.నారాయణరెడ్డి రచించిన భాగవత మందార మకరందాలులోని అన్ని పద్యాలు నేర్చుకున్నాను. భాగవత పద్యాలు, విష్ణు సహస్రం, భగవద్గీత నేర్చుకున్నాను. ఇప్పుడు అనర్గళంగా చెప్పగలుగుతున్నాను.

– గేదుల హేమశ్రీ, ఇంటర్

యూట్యూబ్‌లో ఫేమస్ అయ్యాం



రామాలయం దగ్గర భగవద్గీత నేర్పిస్తున్నారని తెలిసి 9వ తరగతిలో నేర్చుకోవడానికి వచ్చాం. విష్ణు సహస్రం, భగవద్గీత నేర్చుకున్నాం. యూట్యూబ్‌లో నేర్పించే విధంగా వీడియోలు చేస్తే బాగుంటుందనే ఆలోచన వచ్చిన అన్నయ్య.. మాతో భగవద్గీత నేర్పించే విధంగా గురుశిష్య విధానంలో ఆడియోలు రికార్డు చేయించాడు. ప్రస్తుతం 11 అధ్యాయాల వరకూ చేశాం. మేము చేసిన మొదటి వీడియోకు 10 లక్షల వ్యూస్ వచ్చాయి. యూట్యూబ్‌లో మాకు మంచి పేరు వచ్చింది.

– నారదాసు నాగదేవి (బీటెక్), దుర్గాదేవి (డిగ్రీ ఫైనలియర్), అక్కాచెల్లెళ్లు

ఇతరులకు నేర్పుతున్నాను



ఏడో తరగతి నుంచి రాజా అన్నయ్య దగ్గర నేర్చుకుంటున్నాను. భాగవతం, భగవద్గీత, లలితా సహస్రం నేర్చుకోవడమే కాకుండా పెద్దవాళ్లకు నేర్పించాను. ముందుగా నేను నేర్చుకోడానికి వెళ్లినప్పుడు చాలా భయమేసింది. మామూలుగా ఎప్పుడు ఏ పద్యం కూడా చదవని నేను శ్లోకాలు ఎలా చదవగలను అనుకున్నాను. కానీ నాకు ఆయన ముందు ధైర్యం చెప్పి, వాటి మీద మమకారం కలిగేలా చేశారు. దీంతో చాలా తక్కువ సమయంలోనే అన్నీ నేర్చుకున్నా.

– అక్కిరెడ్డి విజయలక్ష్మి, డిగ్రీ ఫైనలియర్

చూడకుండా పాడగలను



సుప్రభాతం, విష్ణు సహస్రం చూడకుండా పాడగలను. నేను 3వ తరగతి నుంచి రాజాచంద్ర అన్నయ్య దగ్గర నేర్చుకుంటున్నాను. చూసి చదవడం కూడా రాని మమ్మల్ని.. చూడకుండా చదవగలిగే స్థాయికి ఆయన తీసుకువచ్చారు. శ్లోకాలు ఎలా చదవాలనే విషయాన్ని ముందుగా మాకు అర్థమయ్యేలా వివరించారు. భయాన్ని తొలగించి సులువుగా నేర్చుకునేలా తర్ఫీదు నిచ్చారు. నేను చూడకుండా శ్లోకాలు చదువుతుంటే మా ఊరిలో వాళ్లందరూ ఆశ్చర్యపోతున్నారు. నాతో పాటు మా ఊరిలో చాలామంది ఆధ్యాత్మిక మార్గంలో ముందుకు సాగుతున్నారు.

– అక్కిరెడ్డి యజ్ఞశ్రీ, 8వ తరగతి

సమగ్రంగా వివరించారు



భగవద్గీతలో ఐదు అధ్యాయాలు, విష్ణు సహస్రం చూడకుండా పాడగలను. నేను మా అమ్మగారికి విష్ణు సహస్రం నేర్పించాను. పాతాల్లో ఉన్న పద్యాలు చదవాలంటేనే నోరు తిరిగేది కాదు. కానీ రాజా చంద్ర మాకు పద్యాలను శ్లోకాలను ఎలా చదవాలి, ఎలా అర్థం చేసుకోవాలనే విషయాలను సమగ్రంగా వివరించి, మాకు నేర్పించారు. మా గ్రామంలో తరగతులు నిర్వహించారు. మాలోని ఆధ్యాత్మికతను వెలికి తీశారు.

– లొడగల విజయ నాగ గన్ని, 8వ తరగతి

దేవాలయాల సమాచారం



హిందూ టెంపుల్స్ గైడ్ అనే పేరుతో సోషల్ మీడియాలో దేవాలయాల సమాచారం అందిస్తూ ఉంటాను. 2010లో చెన్నైలో జాబ్ చేస్తున్నప్పుడు కంచి, మధురై, రామేశ్వరం వెళ్లాను. ఆ సమయంలో తమిళం రాక ఇబ్బంది పడ్డాను. నాలా ఎవ్వరూ ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో బ్లాగ్‌లో ఆ వివరాలు రాస్తూ ఉండేవాడిని. ఆ తర్వాత యూట్యూబ్ చానల్ ప్రారంభించాను. చాగంటి కోటేశ్వరరావు ప్రవచనాలు విని 2017 నుంచి మా గ్రామం విరవలో పిల్లలకు భాగవతం, భగవద్గీత, విష్ణుసహస్ర నామాలు నేర్పిస్తున్నాను. మాతృమూర్తులకు కూడా లలిత, విష్ణు సహస్రం, భగవద్గీత నేర్పిస్తున్నాను.

– రాజా చంద్ర, టెంపుల్ గైడ్ నిర్వాహకుడు, ఆధ్యాత్మిక ప్రచారకర్త, విరవ

అక్కడ అంతా క్షేమమేనా..

- ఇక్కడ స్థిరపడిన రాజస్థానీయుల ఆవేదన
- తమ వారి యోగక్షేమాలపై ఆరా



బార్‌మీర్ ప్రాంతంలో పరిస్థితిని వీక్షిస్తున్న రాజస్థాన్‌కు చెందిన వ్యాపారి

పిఠాపురం: పాకిస్థాన్‌తో నెలకొన్న యుద్ధం నేపథ్యంలో ఆ దేశ సరిహద్దులోని మన రాష్ట్రాల్లో హై అలర్టు ప్రకటించారు. బ్లాక్ అవుట్లు, సైరన్ల మోతతో ఆ ప్రాంతాలు దద్దరిల్లుతున్నాయి. ఈ నేపథ్యంలో మన ప్రాంతంలో స్థిరపడిన రాజస్థానీయులు అక్కడి తమ వారి కోసం ఆందోళన చెందుతున్నారు. వీరందరూ వివిధ వ్యాపారాల కోసం రాజస్థాన్ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు వచ్చి అనేక ప్రాంతాల్లో స్థిరపడ్డారు. ఈ నేపథ్యంలో తమ స్వగ్రామాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు ప్రసార మాధ్యమాల ద్వారా తెలుసుకుంటున్నారు. అక్కడి వారి బంధువులు, స్నేహితులు, కుటుంబ సభ్యులకు ఫోన్లు చేసి పరిస్థితిపై ఆరా తీస్తున్నారు. ముఖ్యంగా రాజస్థాన్‌లోని బార్‌మీర్, జైసల్మేర్, పోక్రాన్ వంటి ప్రాంతాలకు చెందిన తమ వారి యోగక్షేమాలు తెలుసుకుంటున్నారు. మూడు రోజులుగా ఆయా ప్రాంతాల్లో రెడ్ అలర్ట్ ప్రభుత్వం ప్రకటించడంతో వారంతా ఇళ్లకే పరిమితమయ్యారు. భారత ఆర్మీ తమకు అండగా ఉందని, ఎటువంటి ప్రమాదం లేకుండా చూస్తున్నారని అక్కడి వారు తమ బంధువులకు సమాచారం ఇస్తున్నారు.

పెళ్లి వేడుకలో వివాదం





గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

- బీరు బాటిళ్లతో దాడి
- ముగ్గురికి తీవ్ర గాయాలు

పిఠాపురం: ఒక పెళ్లి వేడుకలో వివాదం చెలరేగి, బీరు బాటిళ్లతో దాడి చేసుకోవడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కత్తులగూడెంలోని ఒక ఇంట్లో శనివారం రాత్రి పెళ్లి జరిగింది. అనంతరం పెళ్లి వేదికపై మద్యం మత్తులో డ్యాన్సులు వేస్తూ అల్లరి సృష్టించారు. దీన్ని దిమ్మల మనోజ్ కుమార్ అనే యువకుడు వ్యతిరేకించాడు. దీంతో యువకుల మధ్య వివాదం చెలరేగింది. గమనించిన మనోజ్ కుమార్ తండ్రి తన కుమారుడిని మందలించి ఇంట్లోకి తీసుకెళ్లి పోయాడు. అయితే మిగిలిన యువకుల్లో ఉదయ కిరణ్, తన స్నేహితులతో కలిసి మనోజ్ కుమార్‌పై బీరు బాటిళ్లతో దాడి చేశాడు. దీనిని అడ్డుకున్న మనోజ్ కుమార్ తండ్రి దిమ్మల వెంకటరమణ, దిమ్మల అచ్యుతం, దివ్యపైనా దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో ఆ ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని బాధితుల ఫిర్యాదు మేరకు ఏడుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు నుంచి మంటలు



కారు ఇంజిన్ నుంచి వస్తున్న మంటలు ఆర్పుతున్న దృశ్యం

అన్నవరం: సత్యదేవుని దర్శనానికి రత్నగిరికి విచ్చేసిన ఓ కుటుంబానికి పెను ప్రమాదం త్రుటిలో తప్పింది. వివరాల్లోకి వెళితే.. తూర్పు గోదావరి జిల్లా ధవళేశ్వరానికి చెందిన దంపతులు శనివారం మధ్యాహ్నం తమ ఇద్దరు పిల్లలతో కలిసి కారులో సత్యదేవుని ఆలయానికి విచ్చేశారు. ప్రకాష్ సదన్ సత్రం వద్ద నిలిపిన కొద్ది సేపటికే కారు నుంచి పొగ, మంటలు రావడం మొదలైంది. దీంతో వారు ఆందోళనకు గురై గట్టిగా కేకలు వేయడంతో అక్కడ వాహనాలు నిలిపిన డ్రైవర్లు, ఇతర భక్తులు ఆ కారు వద్దకు వచ్చి బానెట్ ఎత్తి మంటలు ఆర్పేశారు. ఎండ వేడికి కారు ఇంజిన్ హీటెక్కి ఈ ప్రమాదం జరిగిందని భావిస్తున్నారు.

గోదావరిలో దూకి వ్యక్తి ఆత్మహత్య

తాళ్లపూడి (కొవ్వూరు): కొవ్వూరు రోడ్డు కం రైల్వే వంతెన పైనుంచి గోదావరిలోకి దూకి ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చాగల్లుకు చెందిన కొడవటి సుబ్రహ్మణ్యం (62) శనివారం ఉదయం 8.30 గంటల సమయంలో వంతెన పైనుంచి గోదావరిలో దూకాడు. ముందుగా చాగల్లు నుంచి ఆటోలో వచ్చి టోల్ గేటు వద్ద దిగాడు. అక్కడి నుంచి రాజమహేంద్రవరం వైపునకు నడుచుకుంటూ వచ్చాడు. వంతెనపై చెప్పులు వదిలి, గోదావరిలో దూకేశాడు. విషయం తెలిసిన వెంటనే పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఏరినమ్మ ర్యాంపు సమీపంలో అతడి మృతదేహాన్ని వెలికి తీసి, పోస్టుమార్టం కోసం కొవ్వూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా.. సుబ్రహ్మణ్యం అనారోగ్య సమస్యతో బాధపడుతున్నట్టు తెలిసింది. అతడికి భార్య, వివాహమైన ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కొవ్వూరు పట్టణ సీఐ విశ్వం కేసు నమోదు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇంద్రపాలెంలో అగ్ని ప్రమాదం

కాకినాడ రూరల్: మండలంలోని ఇంద్రపాలెం గ్రామంలో శనివారం సాయంత్రం అగ్ని ప్రమాదం జరిగింది. గ్రామానికి చెందిన ఎ.వీరాంజనేయ స్వామి ఇంట్లో విద్యుత్ షార్టు సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో మోటారు సైకిల్, రెండు మోపెడ్లు, టీవీ కాలిబూడిదయ్యాయి. సమాచారం అందుకున్న సాలిపేట అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఈ ఘటనలో సుమారు రూ.1.50 లక్షల ఆస్తినష్టం సంభవించింది.


ప్రతి మహిళా శక్తిగా మారాలి



మాట్లాడుతున్న డీఎస్పీ సత్యనారాయణ

రాజానగరం: మహిళల రక్షణ కోసం ప్రభుత్వం అనేక చట్టాలు అమలు చేస్తోందని, వాటిపై అవగాహన పెంచుకుని ప్రతి మహిళా స్వీయరక్షణతో ఒక శక్తిలా ఉండాలని శక్తి టీమ్ జిల్లా ఇన్‌చార్జి, డీఎస్పీ కేవీ సత్యనారాయణ అన్నారు. దివాన్ చెరువులోని షిరిడీసాయి జూనియర్ కళాశాలలో శక్తి టీమ్ ఆధ్వర్యంలో శనివారం మహిళా చైతన్య కార్యక్రమం నిర్వహించారు. మహిళలు, బాలికలపై జరుగుతున్న లైంగిక దాడుల గురించి ప్రస్తావిస్తూ స్వీయ రక్షణ చర్యలు, సైబర్ నేరాల అదుపు, సోషల్ మీడియా యాప్స్‌తో వచ్చే నష్టాలు, పోక్సో చట్టం, శక్తి యాప్‌లపై అవగాహన కల్పించారు. మహిళలందరూ శక్తి యాప్‌ను తమ సెల్ ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఆ యాప్ ఉపయోగించే విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఐ కె.మంగాదేవి, ఎస్సై రామకృష్ణ, విద్యార్థినులు పాల్గొన్నారు.

నేడు సత్యదేవుని రథోత్సవం



సత్యదేవుని టేకు రథాన్ని పరిశీలిస్తున్న దేవస్థానం అధికారులు

- భారీ టేకు రథంపై ఊరేగనున్న స్వామి, అమ్మవార్లు
- తొలి పావంచా వద్ద ప్రారంభం కానున్న రథోత్సవం
- ఏర్పాట్లు పూర్తి



రథాన్ని ఉంచేందుకు ఏర్పాటు చేసిన షెడ్డు

అన్నవరం: రత్నగిరి వాసుడు సత్యదేవుని దివ్య కల్యాణ మహోత్సవాలలో భాగంగా అత్యంత ప్రాముఖ్యత కలిగిన స్వామివారి రథోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించనున్నారు. 36 అడుగుల ఎత్తయిన నూతన టేకు రథంపై స్వామి, అమ్మవార్లను కొండ దిగువన గల మెయిన్ రోడ్డులో ఊరేగిస్తారు. సాయంత్రం నాలుగు నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకూ వైభవంగా ఈ కార్యక్రమం జరపనున్నారు. ఈ మేరకు దేవస్థానం అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

కార్యక్రమ వివరాలు ఇవే..

- సత్యదేవుని దివ్యకల్యాణ మహోత్సవాలలో భాగంగా స్వామి, అమ్మవార్లను ఊరేగించేందుకు రూ.1,04 కోట్లతో 36 అడుగుల ఎత్తు, 14.6 అడుగుల వెడల్పు, 21 అడుగుల పొడవు గల భారీ రథాన్ని తయారు చేశారు. ఇది అంతర్వేది దేవస్థానం రథం కన్నా రెండు అడుగులు మాత్రమే చిన్నది.
- రథాన్ని ఎత్తే జాకీకి 2 హెచ్‌పీ మోటార్ ఏర్పాటు చేశారు. దీని ఆధారంగా రథాన్ని చుట్టూ తిప్పే వీలుంది. బరువంతా ఈ జాకీ మీద పెట్టినా ఏమీ కాదు.
- రథోత్సవంలో భాగంగా ఆదివారం ఉదయం ఎనిమిది నుంచి పది గంటల మధ్య ఈ రథాన్ని పంపా సత్రం నుంచి తొలిపావంచా వద్దకు తీసుకువస్తారు. మధ్యాహ్నం రెండు నుంచి 2.30 గంటల వరకు పుష్పాలతో, విద్యుత్ దీపాలతో ముస్తాబు చేస్తారు. 2.30 నుంచి 3.30 గంటల వరకు స్వామి, అమ్మవార్లకు అర్చకస్వాములు అలంకరణ చేస్తారు.
- నాలుగు గంటలకు సత్యదేవుడు, అమ్మవారికి పూజలు చేస్తారు. అనంతరం దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, వీర్ల సుబ్బారావు కొబ్బరికాయలు కొట్టి రథం ముందు పోసిన కుంభం మీదుగా రథాన్ని లాగి ప్రారంభిస్తారు.
- రథోత్సవంలో భాగంగా సుమారు 200 మంది కళాకారులు వివిధ కళారూపాలను ప్రదర్శిస్తారు.
- రథోత్సవం సందర్భంగా ఆదివారం ఉదయం నుంచి మెయిన్ రోడ్డులో విద్యుత్‌కు అంతరాయం కలుగుతుంది. 36 అడుగుల రథానికి విద్యుత్ తీగలు తగిలే అవకాశం ఉండడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. రథోత్సవం పూర్తయ్యేవరకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.
- అన్నవరం మెయిన్ రోడ్డులో ఉదయం నుంచి వాహనాలను అనుమతించరు. తుని వైపు నుంచి వచ్చే వాహనాలను మండపం వద్ద గల ఆర్చి నుంచి జాతీయ రహదారి వైపు మళ్లిస్తారు. కాకినాడ, రాజమండ్రి వైపు నుంచి వచ్చే వాహనాలను ఎంవీఆర్ సెంటర్ ఆర్చి నుంచి జాతీయ రహదారి వైపు మళ్లిస్తారు.
- సుమారు 500 మంది పోలీసులతో విస్తృత బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు, సీఐ బి.సూర్య అప్పారావు, మరో పది మంది ఎస్ఐలు ఈ బందోబస్తులో పాల్గొంటారు.
- రథోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కమిషనర్ కె.రామచంద్రమోహన్ ఆదేశాలు జారీ చేశారు.